ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
గురువారం 27 ఫిబ్రవరి 2025



జయ జయ శంకర.. భక్త శుభంకర



వేలాలో గట్టు మల్లన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- శివనామస్మరణతో మార్మోగిన జిల్లా
- ఉదయం నుంచే ఆలయాల్లో బారులుతీరిన భక్తులు
- వేలాల, బుగ్గ రాజరాజేశ్వరస్వామి జాతరకు పోటెత్తిన భక్తజనం

జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి తీరం శివ నామస్మరణతో, శివసత్తుల పూనకాల నడుమ పులకించిపోయింది. వేకువజాము నుంచే ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాల గట్టు మల్లన్న జాతర, బెల్లంపల్లి మండలం బుగ్గ రాజరాజేశ్వరస్వామి, కత్తెరసాలలోని మల్లికార్జునస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు.

జైపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని వేలాల గ్రామంలోని గుట్టపై వెలిసిన గట్టు మల్లన్న జాతరకు బుధవారం భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చి గట్టు మల్లన్నను దర్శించుకున్నారు. తెల్లవారుజామునే భక్తులు కుటుంబాలతో కలిసి వచ్చి గోదావరినదిలో స్నానాలు ఆచరించి గట్టుపై వెలిసిన గుట్ట మల్లన్నను దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు వండి గట్టు మల్లన్న స్వామికి నైవేద్యంగా సమర్పించారు. మల్లన్న స్వామికి భక్తులు వారి పిల్లల తలనీలాలు సమర్పించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో గుట్టపై భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ భక్తులను క్యూలో పంపించారు. క్యూలైన్‌లో నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేశారు. వేలాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటిని భక్తులకు అందజేశారు. భక్తులు రాత్రి గుట్టపైనే జాగారం చేశారు.



గూడెంలో పుణ్యస్నానం ఆచరించి శివయ్యకు మొక్కుతున్న యువతి



గూడెంలో గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

● మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే, సీపీ

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ గట్టు మల్లన్న స్వామిని, గ్రామంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు, ఎంపీకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ఎంపీకి పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రామగుండం సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వేలాల జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ శాఖల సహాయంతో పూర్తి ఏర్పాట్లు చేశామని వివరించారు. డ్రోన్ కెమెరాల ద్వారా జాతరను పర్యవేక్షించారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

భక్తజనసంద్రమైన బుగ్గ జాతర

బెల్లంపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలం కన్నాలలోని బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయం బుధవారం భక్తజన సంద్రమైంది. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ దంపతులు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు సౌకర్యాలను కల్పించారు. నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● మండలంలోని కన్నాల బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కన్నాల నుంచి బుగ్గ దేవాలయం వరకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డుపై వాహనాలు చిక్కుకున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు రోడ్డుకు రెండు వైపులా మట్టితో రోలింగ్ చేయకపోవడంతో వాహనాలు రోడ్డు దిగలేని పరిస్థితి తలెత్తింది. బెల్లంపల్లి నుంచి బుగ్గకు, బుగ్గ ఆలయం నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే వాహనాలు కిక్కిరిసి ట్రాఫిక్ సమస్యకు కారణమైంది. దాదాపు రెండు గంటలకు పైగా వాహనాలు కదలని పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

● కన్నుల పండువగా మల్లికార్జునస్వామి కల్యాణం

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తెరసాలలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లికార్జున-భ్రమరాంబిక కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేసిన భక్తులు బోనాలు పోసి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జున స్వామిని దర్శించుకునేం దుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చెన్నూరు సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెన్నూరు పట్టణ సమీపంలోని పంచకోశ ఉత్తర వాహిని గోదావరి తీరంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు.

గోదావరి తీరం శివ నామస్మరణతో, సైకత లింగాలు, శివసత్తుల పూన కాల నడుమ పులకించిపోయింది. అనంతరం గోదావరి తీర సమీపం లోని హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. పట్టణం లోని అంబా అగస్త్యేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశారు.



సీతారాంపల్లి గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



వేలాల గుట్టపైకి దర్శనం కోసం వస్తున్న భక్తులు



వేలాల గట్టు మల్లన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దంపతులు

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని బుధవారం దండేపల్లి మండలం ద్వారక, లక్ష్మీకాంతపూర్, గుడిరేవు గ్రామాల గోదావరి తీరాలు భక్తజన సందోహంతో నిండిపోయాయి. భక్తులు నదీస్నానాలు చేసేందుకు ఉదయాన్నే కుటుంబ సమేతంగా నదీ తీరానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ద్వారక ఒడ్డున గల గంగమ్మతల్లి, దత్తాత్రేయాలయం, శివాలయం, లక్ష్మీకాంతపూర్ నది ఒడ్డున గల శ్రీమల్లికార్జునస్వామి, నర్సాపూర్‌లో శ్రీభ్రరామంభ మల్లిఖార్జున సమేత, దండేపల్లి భక్త మార్కండేయశివాలయం, మ్యాదరిపేటలో లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, శివపంచాయతన భక్తాంజనేయ నవగ్రహాలకు భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గూడెంలో సత్యనారాయణస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాలను భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి వద్ద భక్తుల రద్దీ పెరగడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, సిబ్బంది, కార్యదర్శి గూడెం గోదావరి నది వద్ద పర్యవేక్షించారు. దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లక్షెట్టిపేట(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంబశివాలయం తో పాటు సాయిబాబా, కన్యకాపరమేశ్వరి ఆలయాలు భక్తులతో కలిటకిటలాడాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాలు దైవ దర్శనాలకు వచ్చిన భక్తులకు పండ్లు నీళ్ల అందించారు. లక్షెట్టిపేట గోదావరిలో సుమారు 20వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి లక్షెట్టిపేట గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరించారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై సతీష్ బందోబస్తును పర్యవేక్షించారు.

గర్మిళ్ల (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని గోదావరి తీరంలో వేల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. సమీప ఆలయాల్లో పూజలు చేశారు. మహ ప్రస్థానంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, సురేఖ దంపతులు శివార్పణ ..

మిగతా 7లో



వేలాలలో ఎంపీ వంశీకృష్ణను సన్మానిస్తున్న దేవాదాయ శాఖ ఈవో రమేష్, సిబ్బంది



మంచిర్యాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల పోలింగ్ జరుగుతుం దన్నారు. ఇందుకోసం 60మంది ప్రిసైడింగ్, 181మంది పోలింగ్ అధికారులు, 25మంది సూక్ష్మపరిశీలకులను నియమించామన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో 1,904 మంది పురుషులు, 11,880 మంది మహిళలు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో 999 మంది పురుషులు, 665 మంది మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయ ఎన్నికలకోసం ఎనిమిది పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎన్నికల కోసం 40పోలింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



దండేపల్లి పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రితో వస్తున్న సిబ్బంది

ఓటు హక్కు వినియోగించుకోవాలి..

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలు, సభలు, ఊరేగింపులు జరపకూడదని తెలిపారు. ఏ రకమైన వాహనం ద్వారా ఓటరును ప్రత్యక్షంగా పరోక్షంగా పోలింగ్ కేంద్రానికి బయటకు తీసుకువెళ్లి ఏర్పాట్లు చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

దండేపల్లి(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం మంచిర్యాల నుంచి ఎన్నికల సామగ్రితో దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలో పోలింగ్ కేంద్రాలకు అధికారులు చేరుకున్నారు. మండలంలో 83 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 1,848 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రుల కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

జన్నారం (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి బుధవారం పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు రావడంతో ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐ రాజమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్సుల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



బ్యాలెట్ బాక్సులను వాహనంలో ఎక్కిస్తున్న సిబ్బంది



ఎన్నికల కోసం సిద్ధమవుతున్న సిబ్బంది

ఘనంగా చండీ హోమం...

● యాగశాల చుట్టూ కలెక్టర్ ప్రదక్షిణ

నస్పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం లో భాగంగా బుధవారం మహాశివరాత్రి సందర్భంగా 24 గంటల పాటు అహోరాత్ర అభిషేకాలు, విశేష ఏకాదశ రుద్ర హోమం, లక్ష పార్థివ లింగార్చన, కోటి బిల్వార్చన, పుష్పార్చన, ఉమామహేశ్వర దివ్య కల్యాణ మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం గోపూజ, తులసీ పూజ, రుద్ర సహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకు మార్చన, విష్ణు సహస్ర నామ, లలిత సహస్ర నామ, సౌందర్య లహరి పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ, రుద్రక్రమార్చన, బిల్వార్చనలు పూజలు నిర్వహించారు. కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న అయుత చండీ, అతి రుద్ర మహా యాగంలో భాగంగా బుధవారం యాగశాల చుట్టూ కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు, వేదపండితులతో కలిసి ప్రదక్షిణ చేశారు.



నస్పూర్‌లో యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



ఆటో బోల్తాపడి ఒకరి మృతి

● ఐదుగురికి గాయాలు

వాంకిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వాంకిడిలోని మహాశివరాత్రి జాతరకు వెళ్లి వస్తుండగా బుధవారం మండలంలోని గోయేగాం గ్రామ సమీపంలో ఆటో (టీఎస్ 01 యూబీ 6747) బోల్తా పడిన ప్రమాదంలో గోయేగాం గ్రామానికి చెందిన షేక్ హకాని(55) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం వాంకిడి మండల కేంద్రంలో జరిగి శివరాత్రి జాతరకు వచ్చి తిరిగి గోయేగాం గ్రామానికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న షేక్ హకాని, అహన్, షేక్ కాతున్‌బీ, ఇసాక్, జైమాబీ, మొహేర్తే లహకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా షేక్ హకాని మార్గ మధ్యలో చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

బెజ్జూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లంబాడీగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో పలువురు ఇంటి నంబరు కోసం దరఖాస్తు చేసుకోగా కార్యదర్శి డబ్బులు అడుగుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఎంపీడీవోకు గతంలో ఫిర్యాదు చేసినా స్పందన లేక పోవడంతో జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధిక లోడ్‌తో అడ్డ దారుల్లో..



భారీ వాహనాల రాకతో లేస్తున్న దుమ్ము

● ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా రాకపోకలు

● టోల్ గేట్లు, చెక్‌పోస్టులను తప్పించుకుంటున్న భారీ వాహనాలు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్ పేట్ మీదుగా హైదరాబార్, ఆంధ్రప్రదేశ్, కర్ణా టక తదితర ప్రాంతాలకు భారీ లారీలు వరుస కడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిత్యం సుమారు 100-150 లారీల వరకు సిర్పూర్(టి) నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి.

అధిక లోడు వాహనాలతో రోడ్లు ధ్వంసమైపోతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. సాధారణంగా మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలు 363- జాతీయ రహదారి మీదుగా జిల్లాను దాటాల్సి ఉంది. అలా కాకుండా లకడి కోట్(రాజురా) చెక్‌పోస్టు రాకముందు అడ్డదారిలో గోండు పిప్రి, దాబా, పోడ్సా, వెంకట్రావ్ పేట్‌ల నుంచి కాగజ్‌నగర్ క్రాస్ మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో లక డికోట్, వాంకిడి చెక్‌పోస్టులతో పాటు అటవీ, ఆర్టీవో చెక్ పోస్టులను వాహనాలు తప్పించుకుంటున్నాయి.


మహారాష్ట్ర నుంచి అధిక లోడ్‌తో వస్తున్న లారీలు

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకే అక్రమార్కులు ఇతర మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లారీల్లో సరుకు రవాణా చేయాలంటే బరువుకు తగ్గ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. అధిక బరువు వాహనాలకు ప్రత్యేక అనుమతులు అవసరం. అంతే కాకుండా ప్రధాన రోడ్ల వెంబడి వెళ్తే టోల్‌గేట్లు, రోడ్ల నష్టం పరిహారం, ఇతర పన్నులు కూడా చెల్లించాల్సి ఉంది. టోలు గేట్లను తప్పించుకునేలా అడ్డదారుల్లో రాకపోకలు సాగించడం చట్టవిరుద్ధం. కానీ ఇవన్నీ తప్పించుకునేందుకే ఇలా అడ్డదారుల్లో రవాణా జరుగుతోందని మండల ప్రజలు చెబుతున్నారు. రవాణా శాఖ, సేల్ టాక్స్ అధికారుల కళ్లుగప్పి ఇలా ఈ మార్గాల మీదుగా ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన వెంకట్రావ్‌పేట్, మాకుడి వద్ద ఆదాయ పన్ను శాఖ, రవాణా శాఖ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తే అక్రమాలను అడ్డుకోవచ్చని ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ అనుమతులు ఉండాల్సిందే..

● స్పెషల్ పర్మిట్: సరుకు లోడును తరలించేం దుకు నిర్దిష్ట రూట్, రోడ్ల అనుమతి అవసరం. ఈ మేరకు రవాణా శాఖ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది.

గ్రాస్ వెహికల్ బరువు పరిమితి :

● జీవీడబ్ల్యూ: వాహనం తయారీ కంపెనీ సూచించిన మొత్తం బరువు పరిమితి కంటే ఎక్కువ బరువుతో ప్రయాణించకూడదు.

● ఫిట్‌నెస్ సర్టిఫికెట్: వాహనం అధిక బరువును భద్రంగా తీసుకెళ్ల గల సామర్థ్యం ఉందని నిరూపించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పని సరి.

● రోడ్ల నష్ట పరిహారం ఫీజు: అధిక బరువుతో రవాణా చేసే వాహనాలు ప్రత్యేక ఫీజు చెల్లించాలి.

● టోల్ చెల్లింపులు: టోల్‌గేట్ల వద్ద చెల్లింపులు తప్పని సరి. వాహన చక్రాల ఆధారంగా పన్ను ఉంటుంది.

● పోలీసు అనుమతి: అత్యవసర రవాణా లేదా అధిక లోడ్‌తో వెళ్లడానికి పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి.

వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నాం

ఇక్బాల్ హుస్సేన్ , ఎఫ్ఆర్వో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వన్యప్రాణులకు నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

ఎఫ్ఆర్వో: అడవులలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టిలు ఏర్పాటు చేశాం. సిబ్బందిచేత పర్యవేక్షించి వాటిలో నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: అడవికి నిప్పు పెడితే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎఫ్ఆర్వో: తునికాకు సేకరణ, ఇప్పపువ్వు సేకరణ కోసం వెళ్లి అడవికి నిప్పు పెడితే ఉపేక్షించలేదు. అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు పులి దాడిలో ఎన్ని పశువులు చనిపోయాయి?

ఎఫ్ఆర్వో: ఇప్పటి వరకు మొత్తం 15 పశువుల చనిపోయాయి. పశువుల యజమానులకు రూ.2,41,800 పరిహారం అందజేశాం. ఇటీవల పులిదాడిలో గాయపడిన సురేష్ అనే వ్యక్తికి రూ.1.97 లక్షల చెల్లించి వైద్యం చేయించాం.

ఆంధ్రజ్యోతి: ఆర్‌వోఎఫ్‌లో సాగు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎఫ్ఆర్వో: ఆర్‌వోఎఫ్‌లో సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం.

- సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి)

శివ్వారంలో పులి సంచారం

జైపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివ్వారం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందని చెన్నూరు ఎఫ్ఎస్‌వో భీమయ్య తెలిపారు. బుధవారం అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జాతర కోసం వచ్చే భక్తులు శివ్వారం అటవీ సమీపంలో ఆగవద్దని సూచిం చారు. రైతులు, పశువుల కాపర్లు అడవి వైపు వెళ్లవద్దని పేర్కొన్నారు. పులికి ఎవరు హానీ తలపెట్టవద్దని తెలిపారు.


పులి పాదముద్రలు

షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం


కాలుతున్న టాటా ఏస్ వాహనం

భీమారం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని బూరుగుపల్లి గ్రామ సమీంపలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామం నుంచి మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం జాతరకు గ్రామస్థులు టాటా ఏస్ వాహనాన్ని అద్దెకు తీసుకుని వెళ్తున్నారు. భీమారం మండలంలోని బూరుగుపల్లి సమీపంలోని రాగానే షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని నిలిపివేసి అందర్ని కిందకు దించాడు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. టాటా ఏస్ వాహనం పూర్తిగా దగ్ధమైంది.

డీసీసీ అధ్యక్షుడితో పాటు పలువురిపై అట్రాసిటీ కేసు నమోదు?

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావుతో పాటు మరో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు సమాచారం. గత ఏడాది నవంబరు 2న జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో కులగణన అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అజ్మీర శ్యాంనాయక్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లో కేసులు నమోదు చేశారు. తాజాగా బుధవారం కేసు దర్యాప్తులో భాగంగా డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావుతో పాటు కాంగ్రెస్ నాయకులు అనిల్‌గౌడ్, రమేశ్, చరణ్, అసద్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ రవిందర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

గోడ వివాదంలో ఒకరి మృతి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట గ్రామంలో మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య జరిగిన గొడవలో సంద్ర రవి(48) అనే వ్యక్తి మృతి చెందాడు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. చిర్రకుంట గ్రామంలో కొంత కాలంగా సంద్రి రవి , సంద్ర ఎల్లయ్య మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటలకు సంద్ర ఎల్లయ్య మీ భూమిలో ఉన్న చెట్టు వల్ల తన గోడ పగిలిపోయిందంటూ తిట్టడంతో సంద్ర రవి అన్న కొడుకు కార్తీక్ ఎందుకు తిడుతున్నావని ఎల్లయ్యను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎల్లయ్య గోడను కాలితో తన్నడంతో పక్కనే ఉన్న సంద్ర రవిపై గోడ కూలిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో రవిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవి బుధవారం మృతిచెందినట్లు తెలిపారు. రవి అన్న కొడుకు కార్తీక్‌కు కూడా గాయాలయ్యాయని తెలిపారు. రవి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

దండేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకులపేటకు చెందిన మహిళా రైతు ముత్తినేని రాజమణి ఆల్లీపూర్ శివారులో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను అడవి పందులు మంగళవారం ధ్వంసం చేశాయి. తన నాలుగెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా, ఎకరం పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని రాజమణి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కంకి దశలో ఉన్న పంట ధ్వంసం కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేయాలి

● అధికారులకు ప్రజల వినతి

లింగాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేకపోవడంతో తరచు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నారు. మండలంలో మొత్తం 71 ఆవాస గ్రామాలు ఉన్నాయి. లింగాపూర్‌కు సిర్పూర్(యు) మండలాలకు ఒకటే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో లోడ్ ఎక్కువై తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండలవాసులు ఆవేదన చెందుతు న్నారు. ఉన్నతాధికారులు స్పందించి లింగాపూర్ మండలానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసి మెరుగైన కరెంట్ అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.21.5 లక్షల మద్యం పట్టివేత

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.21.5 లక్షల మద్యాన్ని బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకు న్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామనుజం వివరాలు వెల్లడించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు కౌటాల సీఐ రమేశ్, ఎస్సైలు ప్రవీణ్, మధుకర్, నరేష్‌తో కలిసి దాడులు చేశామని చెప్పారు. గూడెం గ్రామంలోని శ్రీనిధి వైన్ షాప్ ఓనర్ అయిన సత్యనారాయణ (సంతోష్) అనే వ్యక్తి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం వైన్ షాప్ బంద్ ఉండడం వల్ల దుకాణానికి సరఫరా చేసిన మద్యంను మరోగదిలో నిల్వ చేశాడని చెప్పారు. తన షాపులో పని చేస్తున్న గూడెంకు చెందిన కొంపరి అంజన్నతో నిబంధనలకు అతిక్రమించి మద్యం అమ్ముతుండగా పట్టుకున్నామని తెలిపారు. ఈ మేరకు అక్కడ నిల్వ చేసిన రూ.20,24,160 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదే గ్రామంలో రామగిరి శంకర్ వద్ద రూ.98,400 మద్యం, కే ఆకాశ్ వద్ద రూ.19,200 మద్యం, సంతోష్ జైశ్వాల్ వద్ద రూ.9,130 విలువ చేసే మద్యం పట్టుబడిం దన్నారు. ఈ మేరకు మొత్తం రూ.21,50,890 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని అన్నారు. దాడుల్లో పాల్గొన్న ఏఎస్సై మను, కానిస్టేబుళ్లు విజయ్, తిరుపతి, విజయ్, హెడ్‌కానిస్టేబుల్ దినకర్, మహేష్, ఆనంద్‌తో పాటు టీజీఎస్పీ సిబ్బందిని, ఎస్పీ అభినందించారని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామనుజం

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో మూడు నెలలుగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మూడు నెలలుగా పలు చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు గస్తీ పెంచామని చెప్పారు. తాళం వేసిన ఇళ్ల వద్ద మఫ్టీలో పోలీసులను ఉంచామని తెలిపారు. ఈ క్రమంలోనే బాలాజీనగర్‌లో తాళం వేసిన ఇంటిలోకి ఇద్దరు దుండగులు దూకినట్టు మాటు వేసిన కానిస్టేబుళ్లు రాజు, సంపత్, వెంకటేష్ గుర్తించారని అన్నారు. ఎస్సై సురేష్ సహకారంతో వ్యూహాత్మకంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మోహ్మద్ ఖలీల్, షేక్ ఖలీద్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. వీరిని అదుపులోకి విచారించగా చోరీలు చేసినట్టు ఒప్పుకున్నారని అన్నారు. . వీరు గతంలో ఖమ్మం, ఒంగోలు, గుంటూరు, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో 9 చోట్ల చోరీ చేసినట్టు వివరించారు. నిందితుల నుంచి నగదు, వెండిదీపాలు, వెండి పుష్పాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. కేసు ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ రామానుజం అభినందించారని తెలిపారు. సమావేశంలో ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది


పెంచికలపేటలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

సిర్పూర్(టి), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం గురువారం జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ శ్రీనివాస్, ఈవో తిరుపతి ఆధ్వర్యంలో సిబ్బందికి సౌకర్యాలు కల్పించారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్ర ఏర్పాటు చేశామని తెలిపారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలో పట్టభద్రులు 159, ఉపాధ్యాఉలు 2 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

నిర్లక్ష్యపు నిప్పు .. మొక్కలకు ముప్పు

భీమిని, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు హరితహారం, వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలు నాటుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల ఉదాసీనతతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో చిన్నగుడిపేట రహదారి పక్కన అధికారులు రెండు వైపుల మొక్కలు నాటారు. కానీ రైతులు తమతమ చేనులను సిద్ధం చేస్తున్న క్రమంలో ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో రహదారుల పక్కన ఉన్న వందలాది మొక్కలకు మంట వ్యాపించి బూడిద అవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.


రోడ్డు పక్కన పూర్తిగా కాలిన మొక్కలు

ఉపాధి హామీకి పనుల కొరత

● ఆందోళనలో వ్యవసాయ కూలీలు ● చర్యలు తీసుకోవాలని వినతి

కాసిపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఉపాధి హామీ పథకం పనులు లేక కూలీలు మళ్లీ వలస బాట పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపా ధి హామీపనుల్లో అనేక ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న స్థాయిలో పనులు లేక కూలీలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వ్యవ సాయ పనులు ముగియడంతో ఉపాధి పను లు కూడా లేక పట్టణాలకు వలస వెళ్తున్నారు. ఉపాధి పనికి వెళ్లే కూలీలు పనులు పూ ర్తయ్యే వరకు ఉండి కూలీల కనులను ఫొటో ద్వారా హాజరు నమోదు చేయడంతో కూలీల కు కొంత ఇబ్బందిగా మారింది. అలాగే గతం లో లాగా చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. ఇటీవల పెద్దపులి అడవుల్లో తిరుగుతున్న నే పథ్యంలో అటవీ శివారు గ్రామాల్లోని రైతులు, కూలీలు పనులకు వెళ్లవద్దని అటవీ అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో కూలీలకు ఉపాధి పనులు లేక అవస్థలు పడుతున్నారు. మండలంలో 7400 మంది జాబ్ కార్డు కలిగి ఉన్నారు. ప్రతియేటా 4500 మందికి పైగా ఉ పాధి పనులు చేసేవారు. కానీ ఈ యేడాది రోజుకు కేవలం 381 మంది మాత్రమే హాజ రవుతున్నారు. ఇది కొంత ఆందోళన కలిగించే విషయం. పనులు లేకనే హాజరు కాలేకపో తున్నామని కూలీలు చెబుతుండగా మండల ఏపీవో నవీన్‌కుమార్ మాత్రం పని అడిగిన వారికి తప్పకుండా పని కల్పిస్తున్నామంటున్నారు. పని కోసం కూలీలు సంబంధిత పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని, లేదా 1993 టోల్ ఫ్రీ నెంబరకు ఫోన్ చేసి పేరు, జాబ్ కార్డు నెంబర్ నమోదు చేసుకోవాలని సూచించారు.


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు



లక్సెట్టిపేటలో గోదావరి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బాదంపల్లి గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



చెన్నూర్‌లో..



వేలాల గట్టు మల్లన్నను దర్శించుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్



మంచిర్యాలలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



కత్తెరసాల మల్లికార్జున ఆలయంలో బారులు తీరిన భక్తులు



వేలాలలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

జయ జయ శంకర.. భక్త శుభంకర



బుగ్గ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వినోద్ రమ దంపతులు

5వ పేజీ తరువాయి

మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు మహాప్రస్థానంలో ప్రత్యేక హోమం పూజలు చేశారు. మంచిర్యాలలోని విశ్వనాథస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

నస్పూర్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారాంపల్లి, నస్పూర్ గోదావరినదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. నదీ తీరంలోని గంగాభవాని శంకర ఆలయంలో స్వామివారిని దర్శించి పూజలు చేశారు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. నస్పూర్ పట్టణంలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

జన్నారం(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదావరినది తీర ప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు మండలంలోని ధర్మారం, కలమడుగు, చింతగూడెం, బాదంపల్లి, తిమ్మాపూర్, రాంపూర్, తపాలపూర్, గోదావరి నదితీరాల్లో పుణ్య స్నానాలు ఆచరించారు.

వేమనపల్లి(ఆంధ్రజ్యోతి): భక్తులు ఉదయం వేమనపల్లి ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ స్నానాలకు వచ్చిన భక్తులకు అల్పాహారం, తాగునీరు పంపిణీ చేశారు.

కోటపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే చెన్నూరుతో పాటు పారుపెల్లి, ఎర్రాయిపేట సమీపంలోని గోదావరి నదికి పుణ్యస్నానాలకు తరలి వెళ్లారు. మరో వైపు ఉదయం నుంచే శివాలయాలు హరహర మహాదేవ అంటూ శివనాస్మరణతో మార్మోగాయి. మండల కేంద్రంలోని, పారుపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తులు ఉదయం చెన్నూరులోని పంచకోశ ఉత్తర వాహిని గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు బయలుదేరి వెళ్లారు. మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఇళ్ల ముందు గండ దీపాలు వెలిగించుకుని ఎలాంటి గండాలు రాకూడదని మొక్కుకున్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ గ్రామ శివారులోని సన్యాసి మఠంలో ఉదయం నుంచే భక్తులు శివయ్యను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు శివున్ని దర్శిం చుకుని పూజలు చేశారు.

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలం, రామకృష్ణపూర్‌లో భక్తులు ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

కన్నెపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. శివుడికి అభిషేకాలు నిర్వహించారు.

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని పలు ఆలయాల్లో భక్తులు అభిషేకాలు చేశారు. క్రిష్ణకాలనీలోని శివాలయంలో జరిగిన పూజలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరై పూజలు చేశారు.

ఐటం సెల్ఫీల కోసం పోటీ పడుతున్న భక్తులు

గర్మిళ్ల (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మహా ప్రస్థానంలోని శివుడి విగ్రహాన్ని చూసేందుకు భక్తులు బారులు తీరారు. శివుడి విగ్రహం ఆకట్టుకుంటుండడంతో శివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు శివుడి విగ్రహం వద్ద సెల్ఫీలు దిగుతూ కనిపించారు.





సీతారాంపల్లి గోదావరి రోడ్డు మార్గంలో భక్తుల రద్దీ



బుగ్గ ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ట్రాఫిక్ జామ్‌కావడంతో రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన సురేందర్ (35)అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో బుధవారం తన నివాసంలో మృతి చెందాడు. గేటు వద్ద పడి ఉండడంతో కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజశేఖర్ సందర్శించారు. ఎస్ఐ మాట్లాడుతూ రాజశేఖర్ భార్య పుట్టింటికి వెళ్లిందన్నారు. కొన్నిరోజుల క్రితం రాజశేఖర్ గుండెకు సర్జరీ అయ్యిందన్నారు. గుండెనొప్పితో మృతిచెందాడా లేదా మరేదైనా జరిగి మృతి చెందాడా అనేది విచారణలో తేలుతుందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడు సరేందర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహాశివరాత్రి పుణ్య స్నానాలకు ఎల్లంపల్లి జలాలు

600క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల... గోదావరి తీరంలో లక్ష మంది పుణ్య స్నానాలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గోదావరినదిలో జలాలు లేక మహాశివరాత్రి పుణ్య స్నానాలకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండడంతో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తితో ప్రభుత్వం ఎల్లంపల్లి నీటిని దిగువ గోదావరిలోకి వదిలింది. గోదావరి నదిలో నీరు లేని పరిస్థితిపై రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం రాత్రి నీటిని దిగువకు వదిలేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి సుమారు 600 క్యూసెక్కుల నీటిని గోదావరినదిలోకి వదిలారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటి అవసరాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మిషన్ భగీరథ, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలకు లెక్కగట్టి సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 600 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదిలారు. బుధవారం తెల్లవారుజామున వరకు నీరు రామగుండం, గోదావరిఖని, జనగామ తీరాలకు చేరింది. దీంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సమ్మక్క-సారలమ్మ జాతర పుష్కర ఘాట్ నుంచి లోనికి వెళ్లి పుణ్యస్నానలు ఆచరించారు. పుష్కర ఘాట్ వద్ద శివునికి పూజలు నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ, రామగుండం నగరపాలక సంస్థ భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసింది. జనగామ శివారులోని పుష్కర ఘాట్ కూడా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఎల్లంపల్లి నీటిని వదలడంతో శుభ్రమైన నీటి ప్రవాహం గోదావరిలో ఉన్నట్టు భక్తులు పేర్కొన్నారు. సుమారు లక్ష మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారని అధికారులు పేర్కొంటున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి, సుల్తానాబాద్, కమాన్‌పూర్, మంచిర్యాల జిల్లా జైపూర్, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు.

భక్తుల సౌలభ్యం కోసం నీటి విడుదల..

రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

మహాశివరాత్రి సందర్భంగా గోదావరినదికి పుణ్య స్నానాలకు వచ్చే భక్తుల సౌలభ్యం కోసం ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయించినట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం గోదావరి తీరంలోని పుష్కరఘాట్ వద్ద ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో మహాశివరాత్రి సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, గోదావరి పుణ్యస్నానాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు. నీటి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీరవళి సుమారు వంద మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను వృత్తిరీత్యా హైద్రాబాద్‌లో నివాసం ఉంటున్నప్పటికీ తన స్వగ్రామం చెన్నూరు కావడంతో స్థానిక ప్రజలకు వైద్యం చేయాలని ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్ణచందర్‌గౌడ్, పప్పుబాస్కర్, ఎల్లాగౌడ్, నగేష్, సాకేత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సందర్భంగా మంచిర్యాలలోని గోదావరి పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు ఆర్యవైశ్య సేవా సమితి, మంచిర్యాల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉప్మా, సిరా, మంచినీరు, పండ్లు పంపిణీ చేశారు. గౌతమేశ్వర ఆలయం వద్ద భక్తులు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సమితి సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలాన్ని సంపూర్ణ అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేం దుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం సముదాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కాసిపేట మండలాన్ని వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. వంద రోజుల్లో దీన్ని సాధించాలనిన్నారు. కార్యక్రమంలో అధికారులు పుఉషోత్తం, దుర్గా ప్రసాద్, సంతోష్‌కుమార్, జనార్దన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా గండ దీపం

దండేపల్లి/మందమర్రిరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దండేపల్లి, మందమర్రి మండలాల్లో బుధవారం రాత్రి భక్తులు ప్రతీ ఇంటి ముందు గండ దీపాన్ని వెలిగించారు. మహాశివరాత్రి రోజున ఇంటి ముందు దీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. గండ దీపం వెలిగించడంతో ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.



దండేపల్లిలో ఇంటి ముందు గండ దీపం వెలిగిస్తున్న భక్తురాలు

గోదావరి నదిలో ఒకరి గల్లంతు

కోటపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పారుపెల్లి గ్రామంలో పండగ పూట విషాదం అలుముకుంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లి రాదండి రాజేష్ (45) అనే వ్యక్తి నదిలో గల్లంతయ్యాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామంలోని లక్ష్మీదేవర తదితర గ్రామదేవతలను పుణ్యస్నానాలకు సమీపంలోని ఎర్రాయిపేట వద్ద గోదావరి నదికి గ్రామస్థులు వెళ్లారు. దేవతామూర్తులకు పుణ్యస్నానాలు ఆచరింపజేశారు. గ్రామస్థులంతా ఓ వైపు స్నానాలు చేస్తుండగా రాజేష్ సమీపంలోని లోతైన మడుగులోకి వెళ్లి గల్లంతయ్యాడు. స్నానానికి వెళ్లిన రాజేష్ తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. నాటు పడవల సహాయంతో జాలర్లు సూర్యాస్తమయం వరకు గాలింపు చేపట్టినా రాజేష్ ఆచూకీ దొరకలేదు. చీకటి పడడంతో పోలీసులు గాలింపును నిలిపివేశారు. రాజేష్‌కు భార్య రేవతితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పక్షి మహోత్సవం

జన్నారం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్, గోదావరి పరివాహక ప్రాంత పక్షి వైవిధ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగిచేందుకు మార్చి 1, 2 తేదీల్లో పక్షి ప్రేమికుల కోసం కవ్వాల్ పక్షి మహోత్సవం నిర్వహించనున్నట్టు డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న పక్షి ప్రేమికుల కోసం నిర్వహించనున్నా బర్డ్ వర్క్ షాపునకు పక్షి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తాండూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరు సహకరించాలని సూచించారు.

నిత్యావసర సరుకులు అందజేత

కన్నెపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన నక్కలపెల్లి బాలయ్య అనే నిరుపేదకు శివరాత్రి పండగ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు బట్టు శ్రీనివాస్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంతోష్, వెంకనర్సయ్య, మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గ రాజరాజేశ్వర దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం జాతరకు వచ్చిన భక్తులకు సోనీ జ్యూవెల్లర్స్ అధినేత దిలీప్‌కుమార్ సోని, సురేష్ మర్థ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారులు పాల్గొన్నారు.

కత్తెరసాల ఆలయంలో పూజారుల మధ్య వాగ్వాదం

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తెరసాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పాత పూజారులు, నూతన పూజారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆలయంలో పనిచేస్తున్న ఒక పూజారి, ఒగ్గు పూజారి ఇద్దరూ గత ఏడాది డిసెంబరులో రిటైర్‌మెంట్ కాగా కొత్త పూజారులు వచ్చే వరకు వారినే పూజలు చేయాలని గ్రామస్థులు కోరారు. దీంతో వారు పూజలు చేస్తున్నారు.

ఆలయ కమిటీ ఇటీవల నలుగురు కొత్త పూజారులను నియమించింది. బుధవారం జాతర ప్రారంభం కావడంతో పాత పూజారులు పూజలు చేయవద్దని కొత్త పూజారులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పాత పూజారి స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని 108 వాహనం ద్వారా చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాత పూజారులు కూడా ఉండాలని గ్రామస్థులు అంటున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పి వాగ్వాదాన్ని విరమింపజేశారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం







లక్సెట్టిపేట, మంచిర్యాల, దండేపల్లిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

దండేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దండేపల్లి మండలం ద్వారకలో దత్తత్రేయ, శివాలయం, నర్సాపూర్‌లో శ్రీభ్రమరాంభ సమేత దేవాలయం, మేదరిపేటలో శ్రీకాశీవిశ్వేరశ్వర, లక్ష్మీనారాయణస్వామి దేవాలయం, దండేపల్లి పద్మశాలి సంఘం భవనంలో భక్త మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ వేడుకలు అంగరంగ వైభోపేతంగా జరిగాయి. ముందుగా నర్సాపూర్, మేదరిపేట గ్రామాల్లోని వందలాది మహిళలు మంగళహారతులతో స్వామి ఉత్సవ విగ్రహమూర్తులతో పల్లకితో బాజాభజాంత్రీలతో ఊరేగించారు. అనంతరం దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వేదమంత్రోచ్చరణ మధ్య కమనీయంగా జరిపించారు. భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

లక్సెట్టిపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసాంభ శివాలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి సాంభశివాలయం వరకు అమ్మవారి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ప్రముఖులు తలపై ఎత్తుకుని భాజాభజంత్రీలతో శోభాయాత్రగా ఆలయానికి తీసుకువచ్చారు. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య వేడుకలను జరిపారు. భక్తులకు కమిటీ సభ్యులు రాంచందర్, సత్యనారాయణ, జయప్రకాష్, వొజ్జల శ్రీనివాస్, సంకోజు శ్రీనివాస్‌ఏర్పాట్లు చేశారు.

మంచిర్యాల కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాలలోని రామలింగేశ్వర ఆలయంలో బుధవారం కన్నుల పండగగా శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు రాజేష్‌శర్మ నిర్వహించారు. రాత్రి 12 గంటల అనంతరం స్వామివారికి బిల్వపత్రిని సమర్పించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. స్థానిక అంగడి బజార్ శివ కేశవాలయం, 3వ జోన్‌లోని శివాలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. శివాలయాల్లో రాత్రి శివ పార్వతుల కళ్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా చేపడుతున్న 132 కేవీ లైన్ పనుల కోసం గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఇర్ఫార్ అహ్మాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ లోనవెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కంచరపేట, డోర్‌ప ల్లి, కొమ్ముగూడ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఆసిఫాబాద్‌లో పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



చింతలమానేపల్లిలో పిల్లలకు డ్రింక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



వాంకిడిలో క్యూలో ఉన్న భక్తులు



రెబ్బెనలో రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



శివోహం

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

- ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తుల సందడి
- ప్రత్యేక పూజలు, అర్చనలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్క రించుకొని బుధవారం జిల్లాలోని శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో గల శావాలయంలో శివపార్వతుల కల్యాణం కన్నుల పండువుగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు కల్యాణానికి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని చికిలి నదీ తీరాన గల అతిపూరతనమైన శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఎ సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాస రావు, ఏఎస్పీ చిత్తరంజన్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆలయ కమిటీ ఛైర్మన్ గాదే ప్రవీణ్, వాంకిడి సీఐ సత్యనారా యణ, ఎస్సై ప్రశాంత్, మాజీ జడ్పీటీసీలు అజయ్ కుమార్, అరిగెల నాగేశ్వర్‌రావు, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

లింగాపూర్,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని శివాలయంలో ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్ మాజీ వైస్ ఎంపీపీ ఆడే ఆత్మరామ్ కొత్తపల్లి సర్పంచ్ ఉదయ్‌లక్ష్మి మొక్కులు చెల్లించుకున్నారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): మండలం నంబాలలోని శ్రీ ప్రసన్న పరమేశ్వర శివాలయంతో పాటు గోలేటి దుర్గాపూర్ లోని శివాలయంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జాతరను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చల్లించుకున్నారు.

దహెగాం. (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని లగ్గాం ఉమా చంద్రశేఖర ఆలయం, కుంచవెల్లి రామలింగేశ్వరస్వామిఆలయం,దహెగాం శివకేవ ఆలయం, అయినం, హత్తిని, చిన్నరాస్పల్లి, గిరివెల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం మండల కేంద్రంలోని రంగనాయక శివాలయ హనుమాన్ వీరబ్రహేంద్ర స్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహించారు. రంగనాయక ఆలయంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చప్రాడ ఆధ్యాత్మిక కేంద్రంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

చింతలమానేపలి, (ఆంధ్రజ్యోతి) : మండలం కర్జెల్లి గ్రామ శివారులో గల ముసలమ్మ గుట్ట, రుద్రాపూర్, ఏటిగూడ ఉన్న నాగదేవత ఆలయంలో శివపెల్లి ప్రాంతంలో ఉన్న శివాలయంలో శివరాత్రి సందర్భంగా శివనామ స్మరణంతో ఆలయాలు మారుమోగాయి. ఎమ్మెల్యే పాల్వా యి హరీష్ బాబు భక్తులకు పండ్ల రసం అందజేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం మండల కేంద్రంలోని శివాలయం నుంచి ప్రారంభించి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగించారు.

పెంచికలపేట. (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద వాగు సమీపంలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంతో పాటు మండల వ్యాప్తంగా ఆలయాలు శివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): తాట్‌పల్లి(కుర్ర), తుమ్మిడి హెట్టిలోని కార్తీక్ మహారాజ్ ఆలయాల్లో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. తాట్‌పల్లి, తుమ్మిడిహెట్టిలో పెన్‌గంగ, ప్రాణహిత నదుల్లో ఇసుకతో సైతిక లింగాన్ని తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సదాశివపేట శివాలయం, కంకాలమ్మ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ దండే విఠల్



కౌటాలలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఈసుగాం జాతరకు వస్తున్న భక్తులు

• పోటెత్తిన భక్తులు

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న జాతరకు భక్తులు పోటెత్తారు. ఉదయం నాలుగు గంటల నుంచి ఆలయ వేద పండితులు నరహరి శర్మ, సంతోష్ శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి పూజు చేశారు. అనంతరం సుప్రభాత సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి అభిషేక కార్యక్రమం, రుద్రాభిషేక కార్యక్రమాలను చేపట్టారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, తల్లి మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి ఆలయంలోని శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జడ్పీ ఇన్‌చార్జి ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ ఉమ్మడి జిల్లా పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ తదితరులు శివుడిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ బందోబస్తు నిర్వహించారు ఈసుగాం జాతరకు వస్తున్న భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో పండ్ల రసాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప తన తల్లిదండ్రుల స్మారకార్థం మజ్జిగ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ భక్తులకు ప్రసాదవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. మాజీ జడ్పీ ఇన్‌చార్జి ఛైర్మన్ కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో అరటి పండ్లు పంపిణీ చేశారు. సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాగునీటిని పంపిణీ చేశారు. అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వీఐపీ పాస్‌లను జారీ చేయొద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఎవరికి ఇవ్వలేదు.



అలంకరించిన ఈసుగాం శివాలయం



ఈసుగాం జాతరలో క్యూలో ఉన్న భక్తులు



సందీప్‌నగర్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఇతర నాయకులను సన్మానిస్తున్న సభ్యులు

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

సిర్పూర్(టి), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆమె వెంట అధికారులు రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, రూట్ అధికారి శ్రీనివాస్, ఈవో తిరుపతి ఉన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

దహెగాం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచవెల్లి గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయానికి హమాలీ యూనియన్ కార్మికులు బుధవారం రూ.36వేల విరాళాన్ని అందజేశారు. రెండు మైకులు, అంప్లిఫైర్ అందజేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పుప్పాల మల్లేష్ తల్లి లచ్చక్క ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నారాయణ, నర్సింహాచారి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

రెబ్బెన, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటికి చెందిన నిహారిక ఇటీవల బాపట్ల జిల్లా పిట్టవారి పాలంలోని కేర్ కాలేజీలో నిర్వహించిన యోగా, నెచరోపతి కోర్సులో ప్రతిభ చాటడంతో పలువురు అభినందించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్, డాక్టర్ కె ఎల్ వెంకట్రావు నిహారికను అభినందించి ప్రశంసాప్రతాన్ని అందజేశారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

• సర్వం సిద్ధం చేసిన అధికారులు • జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించనున్నారు. పోలింగ్ కోసం ఇప్పటికే అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బుధవారం పోలింగ్ సామ గ్రితో సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు బయలు దేరి వెళ్లారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి వెళ్లె వాహనాలకు జిల్లా కలెక్టర్ వెంక టేష్ దోత్రే అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో లోకేశ్వ ర్‌రావు, డీఆర్‌డీవో దత్తరాంతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

సమీకృత కలెక్టరేట్‌లో..

ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అధికారులు అందజేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఇతర సామగ్రితో కలెక్టరేట్ నుంచి ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, అదనపు ప్రిసైడింగ్ అధికారి, మరో ఉద్యోగితో పాటు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భద్రతకు పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. వీరంత బుధవారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ జరిగే ప్రతి కేంద్రం వద్ద వెబ్‌కాస్టింగ్‌తో పాటు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. పోలింగ్ అనంతరం సిబ్బం ది బ్యాలెట్ బాక్సులను సీజ్ చేసి జిల్లా కేంద్రానికి తీసుకురానున్నారు. జిల్లాలో అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలకు గురువారం వేతనంతో కూడిన సెలవు ప్రకటించామని తెలిపారు.

రెండు నియోజకవర్గాల పరిధిలో..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజక వర్గంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎనిమిది, సిర్పూర్ నియోజ కవర్గంలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవ ర్గంలో 2,315 మంది పట్టభద్రులు, 184 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. సిర్పూర్ నియో జకవర్గంలో 3,822 మంది పట్టభద్రులు, 286 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. మొత్తం జిల్లాలో 6,607 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది





ఎన్నికల సామగ్రితో తరలి వెళుతున్న సిబ్బంది